సాక్షి ఒడిశా

శుక్రవారం । 28 । మార్చి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,01,014లు, బంగారం 9 గ్రాముల 900 మిల్లీగ్రాములు, వెండి 104 గ్రాముల 900 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



స్వచ్ఛ జయపురం

పరిశుభ్రమైన పట్టణం లక్ష్యంగా జయపురంలో గురువారం సామూహిక పారిశుద్ధ్య అభిజాన్ నిర్వహించారు.

-IIలో



గంగాజలంతో నిరసన

బీజేపీ సభ్యుల అప్రజాస్వామిక చర్యలతో సభా ప్రాంగణం అపవిత్రమైందని పేర్కొంటూ రాష్ట్ర శాసనసభను బీజేడీ సభ్యులు గంగాజలంతో శుద్ధి చేశారు.

-IIలో



శాసన సభ వద్ద కాంగ్రెస్ కార్యకర్తల ఆందోళన



ఆందోళనకారుల్ని చెదరగొడుతున్న పోలీసులు

రణరంగం

మహిళల భద్రతపై ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఓపీసీసీ గురువారం చేపట్టిన శాసన సభ ముట్టడి రణరంగాన్ని తలపించింది. బహిరంగ సభ అనంతరం శాసన సభ వైపు దూసుకుపోయేందుకు కార్యకర్తలు ఒక్కసారిగా పోటెత్తడంతో పరిస్థితి అదుపు తప్పింది. పోలీసులు రంగంలోకి దిగి ఆందోళనకారులను నిలువరించేందుకు చేసిన ఫలితాలు సఫలం కాకపోవడంతో చివరకు భాష్పవాయువు ప్రయోగించి చెదరగొట్టారు. ఈ క్రమంలో పలువురు కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారు.

– భువనేశ్వర్



కుర్చీలతో పోలీసుల్ని ఎదుర్కొంటున్న కాంగ్రెసు ఆందోళనకారులు



గాయపడిన ఆందోళనకారుడు

దాడిలో కార్యకర్త తలకు గాయం



ఆస్పత్రి పాలైన కార్యకర్తల్ని పరామర్శించిన ఓపీసీసీ చీఫ్ భక్త చరణ దాస్



బహిరంగ సభలో మాట్లాడుతున్న వక్తలు



ఆందోళనకారులపై పోలీసుల భాష్ప వాయు ప్రయోగం

దద్దరిల్లిన దిగువ పీఎంజీ కూడలి

భువనేశ్వర్ : ముందస్తు వ్యూహం ప్రకారం రాష్ట్ర కాంగ్రెస్ ప్రముఖుల ఆధ్వర్యంలో గురువారం శాసన సభ ముట్టడి నిర్వహించింది. ఈ సందర్భంగా స్థానిక రామ మందిరం ఆవరణ నుంచి భారీ ఊరేగింపుతో కాంగ్రెసు భవన్ ప్రాంగణం చేరారు. ఇక్కడ నిర్వహించిన బహిరంగ సభలో పార్టీ ప్రముఖులు ఆందోళనకు సంబంధించి భావోద్వేగ ప్రసంగాలు వినిపించారు. అనంతరం శాసన సభ ముట్టడి కోసం మూకుమ్మడిగా తరలివెళ్లారు. దీంతో దిగువ పీఎంజీ కూడలి గురువారం రణరంగంగా మారింది. కాంగ్రెస్ కార్యకర్తలు, పోలీసుల మధ్య ఘర్షణతో ఈ పరిస్థితి తాండవించింది. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు ఆందోళనకు దిగడంతో వీరిని కట్టడి చేసేందుకు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. పోలీసుల చర్యలపట్ల రెచ్చిపోయిన కాంగ్రెసు కార్యకర్తలు కుర్చీలు, గుడ్లు, టమాటాలు, వాటర్ బాటిల్లు రువ్వారు. ప్రతి చర్యగా ఆందోళనకారులపై పోలీసులు లాఠీ ఝులిపించారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో వాటర్ స్ప్రే, భాష్ప వాయు ప్రయోగంతో నిరసనకారులను చెదరగొట్టారు. ఈ ఘటనలో పలువురు వ్యక్తులు గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. అంతకుముందు నిర్వహించిన సభలో ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళలు, విద్యార్థులకు భద్రత కల్పించేందుకు కార్యాచరణతో ముందుకు రావాలని, లేకుంటే నిరసన కొనసాగుతుందని స్పష్టం చేశారు.

న్యూస్‌రీల్

మద్యం మత్తులో నీటిలో పడి మహిళ మృతి



బుచ్చిమాడీ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఎంవీ 79 పోలీసు స్టేషన్ పరిధి తేల్‌రాయి పంచాయతీ సమీప గ్రామంలో మద్యం మత్తులో ఒక మహిళా నీటిలో పడి మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలో ఇద్దరు తోటికోడళ్లు అయినటువంటి రామే మాడీ, బుచ్చి మాడీలు తమ పొలంలో ఉన్న ఇప్పచెట్టు పూల కోసం బుధవారం ఉదయం వెళ్లారు. వాటిని సేకరించి అమ్మిన తర్వాత ఇద్దరూ సాయంత్రం 4 గంటల సమయంలో మద్యం సేవించారు. అనంతరం డబ్బులు కోసం గొడవపడ్డారు. ఈ గొడవలో ఇద్దరూ చూసుకోకుండా సమీపంలో ఉన్న నీటి కాలువలో పడిపోయారు. దీంతో బుచ్చి(48) అక్కడికక్కడే మృతి చెందింది. అయితే అటుగా వచ్చిన కొంతమంది రామేమాడీని రక్షించి వెంటనే కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఎస్ఐ చందన్ బెహర ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామన్నారు. కాగా చికిత్స పొందుతున్న రామేమాడి ఆరోగ్యం కుదుటపడిందని వైద్యులు తెలిపారు.

177 కేజీల గంజాయి స్వాధీనం

- కారు వదిలేసి పరార్



కారులో పట్టుబడిన గంజాయి బస్తాలు

జయపురం: జయపురం సమితి గొడొపొదర్ సమీప రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద నిలిపి ఉన్న ఒక కారులో 177 కేజీల గంజాయి సదర్ పోలీసులకు బుధవారం రాత్రి చిక్కింది. పట్టుబడిన గంజాయి విలువ రూ.17 లక్షలకు పైనే ఉంటుందని గురువారం వెల్లడించారు. పోలీసు అధికారి ప్రదాన్ తెలిపిప వివరాల ప్రకారం.. జయపురం సదర్ పోలీసు స్టేషన్ పరిధిలోని గగణాపూర్ పోలీసు పంటి అధికారి, సబ్ ఇన్‌స్పెక్టర్ రాజకిశోర్ బారిక్ నేతృత్వంలో పెట్రోలింగ్ నిర్వహించారు. గొడొపొదర్ మార్గంలో ఓ కారు నిలిచి ఉంది. కారులో ఎవరూ లేరు. కారు వద్ద గంజాయి వాసన రాగా అనుమానించిన పెట్రోలింగ్ పోలీసులు తనిఖీ చేశారు. కారులో గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. వీటిని మెజిస్ట్రేట్ సమక్షంలో గంజాయి తూకం వేయగా 177 కేజీలు ఉన్నట్లు తెలిపారు. పోలీసులను చూసి గంజాయి మాఫియా గ్యాంగ్ పరారై ఉంటారని పోలీసు అధికారి ప్రదాన్ వెల్లడించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ప్రదాన్ తెలిపారు.


జీవామృతం తయారీపై అవగాహన



కిట్లతో స్వయం సహాయక మహిళలు

మల్కన్‌గిరి : జిల్లాలోని కలిమెల సమితి అటవీశాఖ సమావేశ మందిరంలో బుధవారం కలిమెల, మోటు అటవీశాఖ రక్షణ కమిటీ సభ్యులకు జీవామృతం వ్యవసాయంపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా భువనేశ్వర్‌కు చెందిన గ్రామీణ ఉత్పత్తి వ్యాపార సంస్థ డైరెక్టర్ ప్రఫుల్ల బిశ్వాయి మాట్లాడుతూ జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. స్వయం సహాయక సంఘ సభ్యులకు సూచనలు అందించారు. అనంతరం కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అటవీ అధికారి మృత్యుంజయ శెఠి, శ్రీనివాస్ పాత్రో, అభిమన్యు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న దాతలు

జయపురం: తెలుగు సినీ నటుడు, గ్లోబల్ స్టార్ రామచరణ్ పుట్టినరోజు సందర్భంగా జయపురం గ్లోబల్ స్టార్ రామచరణ్ యువత గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కొరాపుట్ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 15 యూనిట్ల రక్తం సేకరించినట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వై.శ్రీనివాస ఖన్నా తెలిపారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జయపురం శాఖ ప్రెసిడెంట్ మల్లికార్జున నాయిక్, ఉపాధ్యక్షుడు జి.సతీష్, కార్యదర్శి అలోక్ కోళ్లా,సహాయ కార్యదర్శి కె.వినోద్ పాల్గొన్నారు.

1 నుంచి పిల్లలకు లడ్డు



భువనేశ్వర్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రభుత్వ సహాయంతో నడుస్తున్న పాఠశాలలో పిల్లలకు పౌష్టిక లడ్డు పంపిణీ చేయనున్నారు. ఉత్కళ దివస్ పురస్కరించుకుని ఏప్రిల్ 1 నుంచి ఈ కార్యక్రమం ప్రారంభిస్తారు. ప్రధాన మంత్రి పోషణ్ యోజన కింద 1 నుంచి 10వ తరగతి పిల్లలకు సోమ, మంగళ, గురువారాల్లో విద్యార్థులకు ఈ లడ్డు అందిస్తారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ఘాటీ మలుపులో బోల్తాపడిన బస్సు



ప్రమాదాలకు కారణమవుతున్న మలుపు

- ప్రైవేటు బస్సు బోల్తా
- 27 మందికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం

రాయగడ: జిల్లాలోని కొలనార సమితి ముకుందపూర్ ఘాటీ మలుపులో గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో బరంపురం నుంచి టికిరి వైపు వెళ్తున్న ప్రైవేటు బస్సు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 45 మందిలో 27 మందికి గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. క్షతగాత్రులను అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, స్థానికులు సహాయ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. బరంపురం నుంచి బుధవారం రాత్రి 9 గంటలకు బయల్దేరిన బస్సు ముకుందపూర్ ఘాటికి చేరుకునేసరికి తెల్లవారుజామున 4 గంటలయ్యింది. ఘాటీ మలుపులో బస్సు అదుపు తప్పడంతో బోల్తా పడింది. దీంతో బస్సులోని ప్రయాణికులు పెద్ద కేకలు పెట్టారు. కాగా క్షతగాత్రుల వివరాలు తెలియడం లేదు. స్వల్పగాయాలు తగిలిన కొంతమంది చికిత్స అనంతరం వారి వారి ఇళ్లకు వెళ్లిపోయినట్లు సమాచారం

ప్రమాదపు మలుపు

ముకుందపూర్ ఘాటీ మలుపులో తరచూ ఇటువంటి ప్రమాదాలు చోటు చేసుకుంటుండడం పరిపాటిగా మారింది. మలుపు వద్ద అత్యంత వేగంతో వచ్చే వాహనాలు ఇటువంటి తరహా ప్రమాదాలకు గురవుతున్నాయి. డ్రైవర్లు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ఈ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో కొద్ది నెలల క్రితం ప్రమాదాలను హెచ్చరించే విధంగా మలుపుల వద్ద బోర్డులను కూడా రవాణా శాఖ ఏర్పాటు చేసింది. అయినా అవేవీ పట్టించుకోని చోదకులు అతివేగంతో వాహనాలు నడపడం ఈ ప్రమాదాలకు కారణమవుతోంది. ఇదిలా ఉండగా గురువారం బస్సు బోల్తా ఘటనకు సంబంధించి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. పక్కనే ఉన్న లోయలో బస్సు పడి ఉంటే ప్రమాద తీవ్రత అంచనాలకు అందేది కాదని పలువురు పేర్కొంటున్నారు.



అంబులెన్స్‌లో చికిత్స కోసం వచ్చిన క్షతగాత్రులు



స్వల్పగాయాలతో బయటపడిన విద్యార్థులు

కారు-ట్యాంకర్ ఢీ



ప్రమాదానికి కారణమైన ట్యాంకర్

రాయగడ: స్థానిక కొరాపుట్ నాలుగు రోడ్డు కూడలి వద్ద గురువారం మధ్యాహ్నం కారు, ట్యాంకర్ ఢీకొన్న ఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. అదృష్టవశాత్తు ఎవరూ గాయపడలేదు. ట్రాఫిక్ నిబంధనలు బేఖాతరు చేస్తూ నిర్లక్ష్యంగా వాహనాలు నడపడంతో ఇటువంటి ప్రమాదాలు ఇక్కడ తరచూ చోటుచేసుకుంటున్నాయి. కారు నడుపుతున్న వ్యక్తి ఒడిశా పోలీస్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. వివరాలు తెలియాల్సి ఉంది.



నుజ్జునుజ్జయిన కారు

గంజాయితో ఆరోగ్య కార్యకర్త అరెస్టు



ప్రభుత్వ క్వార్టర్స్‌లో దాడులు నిర్వహిస్తున్న పోలీసులు



దాడుల్లో అరెస్టైన జ్యోత్స్న

రాయగడ: ఒక గంజాయి కేసులో ఆరోగ్య కార్యకర్తను జిల్లాలోని పద్మపూర్ పోలీసులు బుధవారం సాయంత్రం అరెస్టు చేశారు. అరెస్టైన మహిళ కేంద్రపడ జిల్లాకు చెందిన జ్యోత్స్నరాణి శెఠిగా పోలీసులు గుర్తించారు. ఆమె నుంచి 2.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. పద్మపూర్ సమితి పరిధిలోని గులుగుడ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం నిర్వహిస్తున్నారు. దీనిలో ఆరోగ్య కార్యకర్తగా పనిచేస్తున్న జ్యోత్స్న కొద్దికాలంగా అక్రమంగా గంజాయి క్రయవిక్రయాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు బుధవారం సాయంత్రం ఆమె ఉంటున్న ప్రభుత్వ క్వార్టర్స్‌లో దాడులు నిర్వహించారు. దీంతో గంజాయి బయటపడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న వంటల పోటీలు

రాయగడ:

స్థానిక మున్సిపల్ టౌన్‌హాల్‌లో రాయగడ జిల్లా ఉత్కళ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన వంటల పోటీల్లో మహిళలు ఆసక్తిగా పాల్గొన్నారు. తెలుగు సంస్కృతికి అద్దంపట్టే పిండివంటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇంట్లో స్వయంగా తయారు చేసుకొని వచ్చిన మహిళలు ఈ పోటీల్లో వాటిని ప్రదర్శించారు. స్థానిక సాయి ఇంటర్నేషనల్ చెఫ్ సత్యనారాయణ, ఆశాలత పట్నాయక్, ప్రణతి పాత్రోలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. రుచి, శుచి, అలంకరణ తదితరమైన వాటికి ప్రాధాన్యత కల్పించి విజేతలను ఎంపిక చేశారు. పోటీల్లో ప్రథమ బహుమతిని కె.సంతోషిణి, ద్వితీయ బహుమతిని పి.నాగమణి, తృతీయ బహుమతిని కె.సత్యలు గెలిపొందగా, ఎం.సోనాలి, పద్మావతి పాడి, ఎం.రేవతిలకు ప్రోత్సాహక బహుమతులు లభించాయి. విజేతలకు ఉగాది వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.



వంటల పోటీల్లో పాల్గొన్న మహిళలు (ఇన్‌సెట్లో) న్యాయనిర్ణేతలు

క్లుప్తంగా

చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు



బస్సు చెట్టును ఢీకొన్న దృశ్యం

పర్లాకిమిడి: కాశీనగర్ సమితి సింగిపురం గ్రామం వద్ద ఒడిశా ఆర్టీసీ బస్సు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో బస్సులో ఉన్న పలువురి ప్రయాణికులకు గాయాలయ్యాయి. కటక్ నుంచి గుణుపురం వెళ్తున్న బస్సు సింగిపురం గ్రామం వద్ద ఉదయం 4 గంటల సమయంలో అదుపు తప్పింది. స్వల్పంగా గాయపడిన ప్రయాణికులను పర్లాకిమిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాశీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

గంగా జలంతో బీజేడీ నిరసన



గంగా జలం కలశాలతో బీజేడీ సభ్యుల నిరసన

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభలో విపక్ష బిజూ జనతా దళ్ సభ్యులు గంగాజలంతో నిరసన తెలిపారు. అధికార పక్షం భారతీయ జనతా పార్టీ సభ్యుల అప్రజాస్వామిక చర్యలతో సభా ప్రాంగణం అపవిత్రం అయిందని మండిపడ్డారు. సభని పవిత్రంగా పునరుజ్జీవం పోసేందుకు గంగా జలంతో శుద్ధి చేసినట్లు పేర్కొన్నారు. గురువారం సభలో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ఈ ప్రదర్శన చోటు చేసుకుంది. బీజేడీ సభ్యులు ఇత్తడి కలశాలతో నీటిని తీసుకుని సభలోకి ప్రవేశించారు. సభలో నలువైపులా పవిత్ర జలాన్ని చల్లుతూ విభిన్న రీతిలో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా స్పీకర్ సురమా పాఢి జోక్యం చేసుకొని శాసన సభ్యులు కలశాలను తీసుకొని సభ్ లోపలికి రావద్దని వారించారు. దీంతో సభ వెలుపల తమ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ చర్య సర్వత్రా చర్చనీయాంశమైంది.

పాత్రికేయుడికి గాయాలు

భువనేశ్వర్: కాంగ్రెస్ కార్యకర్తల రాష్ట్ర శాసన సభ ముట్టడి ఆందోళన సందర్భంగా ఓ పాత్రికేయుడు గాయపడ్డాడు. పోలీసులు, ఆందోళనకారుల మధ్య ఘర్షణ కవరేజీ చేస్తుండగా స్థానిక ప్రైవేటు టీవీ ఛానెల్ పాత్రికేయుడు చిక్కుకున్నాడు. గాయాలు కావడంతో తక్షణమే ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

29లోగా నవోదయ విద్యార్థులు రిపోర్టు చేయాలి

సరుబుజ్జిలి: జవహర్ నవోదయ ఫలితాలు విడులైన నేపథ్యంలో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 29 లో గా ధ్రువపత్రాలను వెన్నెలవలస నవోదయ విద్యాలయానికి తీసుకురావాలని ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య కోరారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకట న విడుదల చేశారు. కార్యాలయం పనివేళల్లో మాత్రమే సంప్రదించాలని పేర్కొన్నారు.

పూరిల్లు దగ్ధం



ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఈదుపురంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. కార్జి వీధికి చెందిన యర్రమ్మ కుటుంబ సభ్యులతో కలిసి తన పూరింటిలో నిద్రపోయింది. అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కోడలు శేషమ్మ మేల్కొని కుటుంబ సభ్యులను అప్రమత్తం చేసి బయటకు పరుగులు తీశారు. అగ్ని కీలలు ఎగసిపడటంతో ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు నర్తు ప్రేమ్‌కుమార్ స్పందించి స్థానిక యువకుల సహాయంతో మంటలు ఆర్పే ప్రయత్నం చేసి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న సుమారు రెండు లక్షల రూపాయల సామగ్రి, రూ.30వేలు నగదు కాలిపోయినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

గంజాయితో మహిళ అరెస్టు

ఇచ్ఛాపురం టౌన్ : ఒడిశా నుంచి సికింద్రాబాద్‌కు గంజాయి తరలిస్తున్న మహిళను గురువారం అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ మొబైల్ సీఐ జి.వి. రమణ తెలిపారు. శ్రీకాకుళం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలిసి తనిఖీలు చేస్తుండగా ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్ద రంజువాలిక్ అనే మహిళ అనుమానాస్పదంగా కనిపించింది. తనిఖీ చేయగా 10.3 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ తనిఖీల్లో సిబ్బంది విశలేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లక్ష్యం.. స్వచ్ఛ జయపురం

- పరిశుభ్రమైన పట్టణం లక్ష్యంగా సామూహిక పారిశుద్ధ్య అభిజాన్
- చెత్తాచెదారాలను తొలగించిన అధికారులు, సిబ్బంది, ప్రజలు



స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాలీలో అధికారులు, విద్యార్థులు

స్వచ్ఛ జయపురం లక్ష్యంగా గురువారం స్థానిక గాంధీ కూడలిలో అధికారులు సామూహిక పారిశుద్ధ్య అభిజాన్ కార్యక్రమం నిర్వహించారు. కొరాపుట్ జిల్లాలోనే ప్రధాన కేంద్రమైన జయపురం పట్టణాన్ని రాష్ట్రంలో పారిశుద్ధ్య నిర్వహణలో నంబర్ వన్ పట్టణంగా తీర్చిదిద్దటానికి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు సబ్ కలెక్టర్, మున్సిపాలిటీ కార్యానిర్వాహక అధికారి ఎ.శౌశ్యరెడ్డి తెలిపారు. అధికారులు, సిబ్బంది, కార్మికులతో కలిసి చెత్తాచెదారాలను తొలగించారు. వ్యర్థాలను కాలువలో పారబోయవద్దంటూ స్థానికులకు అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉంటే దోమలు, ఈగలు వ్యాప్తి చెందే అవకాశముందంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు కౌన్సిలర్లు, అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. – జయపురం



సామూహిక పారిశుద్ధ్య అభిజాన్‌లో పాల్గొన్న మున్సిపల్ సిబ్బంది



గాంధీ జంక్షన్ హోర్డింగ్ వద్ద..



చెత్తను ట్రాక్టర్‌లోకి వేస్తున్న సబ్ కలెక్టర్ శౌశ్యరెడ్డి



కెనాల్ రోడ్డును శుభ్రం చేస్తున్న మహిళా శ్రామికులు



పారిశుద్ధ్య పనులు చేపడుతున్న దృశ్యం

పరిశ్రమల స్థాపనకు అవకాశం కల్పిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న జనకల్యాణ్ శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ జీవన్ దాస్

- జిల్లా పరిశ్రామిక శాఖ అధికారి సునారాం సింగ్

పర్లాకిమిడి: దివ్యాంగులు పరిశ్రమల స్థాపనకు అనేక పథకాలు ఉన్నాయని, ఎవ్వరూ దరఖాస్తు చేసుకోవడం లేదని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సునరాం సింగ్ అన్నారు. గురువారం స్థానిక పాతపట్నం రోడ్డు సెంటర్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కాన్ఫరెన్స్ హాల్‌లో దివ్యాంగులకు జీవనోపాధి, ఉపాధి కల్పనపై సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దివ్యాంగుల్లో మనోస్థైర్యం కల్పించి, వారికి పారాశ్రామిక సామర్థ్యం కల్పించే దిశగా సమర్థ్ దివ్యాంగుల సంస్థ పనిచేయాలన్నారు. గ్రామీణ ఉద్యోగ్ శిక్షణా సంస్థ జీవన్ దాస్, సెంటర్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యదర్శి అడ్డాల జగన్నాథ రాజు, జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ జీవన్ దాస్ హాజరయ్యారు. జిల్లాలో సమితి స్థాయిలో రాయగడలో జరిగిన ఉద్యోగ మేళాకు అర్హులైన దివ్యాంగులకు అవకాశం అధికారులు కల్పించలేదని సమర్థ్ దివ్యాంగుల సంస్థ కార్యదర్శి సంతోష్ మహారాణా అన్నారు. ఇకపై జాబ్ మేళాలో చదువుకున్న దివ్యాంగులకు కూడా స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ, ఉపాధి కల్పించేవిధంగా ఏర్పాటు చేస్తామని సునారాం సింగ్ అన్నారు.

అందరి సహకారంతోనే ఉగాది ఉత్సవాలు



మాట్లాతున్న మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు

రాయగడ: రాయగడ జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ పేరిట గత 12 ఏళ్లుగా నిర్వహిస్తున్న వేడుకలను ఈసారి కూడా అందరి సహకారంతో ఘనంగా నిర్వహించాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు అన్నారు. స్థానిక తేజస్వీ ఒపెన్ గ్రౌండ్‌లో ఈ నెల 30, 31వ తేదీల్లో జరగనున్న ఉగాది వేడుకల నిర్వహణకు సంబంధించి గురువారం రాణిగుడఫారంలో గల ఆయన స్వగృహంలో పట్టణ ప్రముఖులతో సమావేశమయ్యారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే ఈ ఉత్సవాలను భావితరాలు కూడా నిర్వహించేలా మనం ప్రోత్సాహించాలన్నారు. గత మూడేళ్లుగా ఈ ఉత్సవాలు రెండు వేదికల్లో నిర్వహించడంతో ప్రజలు కొంతమేర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఎన్నిచోట్ల ఉగాది వేడుకలు జరుగుతున్నప్పటికీ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు భంగం కలగకుండా చూడాలన్నారు. చందాల పేరిట ప్రజలను ఇబ్బంది పెట్టే ప్రక్రియ చేపట్టవద్దన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఉగాది వేడుకలకు సంబంధించి నిర్వహిస్తున్న వివిధ పోటీల వివరాలను ప్రకటించారు. ఆదివారం స్థానిక మజ్జిగౌరి మందిరం నుంచి నిర్వహించనున్న కలశ యాత్ర వివరాలను వివరించారు. చంద్రమౌళి కుముందాన్, రాఘవ కుముందాన్, ఎస్.జగన్నాథరావు, టి.త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు మార్చేసి.. రూ.1.63 లక్షలు దోచేసి..



శ్రీకాకుళం క్రైమ్ : ఓ రిటైర్డ్ అధికారి వద్ద ఏటీఎం కార్డు మార్చేసి రూ. 1,63,900 కొట్టేసిన వైనం జిల్లా కేంద్రంలోని అరసవల్లి మిల్లు కూడలి సమీప ఎస్బీఐ ఏటీఎంలో చోటు చేసుకుంది. ఒకటో పట్టణ ఎస్ఐ ఎం. హరికృష్ణ, బాధితుడు తెలిపిన వివరా ల ప్రకారం.. అరసవల్లి మిల్లు జంక్షన్ సమీపంలో ఎస్బీఐ ఏటీఎం సెంటర్‌కు ఓ రిటైర్డ్ అధికారి వెళ్లి రూ.9 వేలు విత్‌డ్రా చేశారు. కార్డును మిషన్ నుంచి తీయకుండానే పక్కనే ఆ డబ్బులు లెక్కపెడుతుండగా వెనుకగా నిల్చొన్న గుర్తు తెలియని వ్యక్తి గమనించాడు. క్షణాల్లో అధికారి కార్డు తీసేసి తన కార్డును మిషన్‌లో పెట్టేశాడు. సార్ మీ కార్డు మిషన్‌లో ఉంచేశారు.. తీయండి అంటూ సాయం చేసినట్లు నటించి అక్కడి నుంచి పరారయ్యాడు. అక్కడికి రెండు రోజుల తర్వాత ఎస్బీఐ యోనోయాప్ ద్వారా బ్యాలెన్స్ చెక్ చేయగా రూ.1,63,900 ఎవరో ఏటీఎం కార్డు ద్వారా విత్‌డ్రా చేసినట్లు అధికారి గ్రహించారు. వెంటనే తన వద్దనున్న ఏటీఎం కార్డు తీసుకెళ్లి తనిఖీ చేయ గా బ్యాలెన్స్ తక్కువగా కనిపించడంతో వెంటనే సంబంధిత మెయిన్ బ్రాంచి (ఎస్బీఐ) అధికారులను కలువగా కార్డును బ్లాక్ చేసి స్టేట్‌మెంట్ తీసి చూపించి పోలీసులను ఆశ్రయించాలన్నారు.

పలుచోట్ల తీసి.. చివరికి ఒడిశాలో..

స్టేట్‌మెంట్‌లో మోసం చేసిన వ్యక్తి ముందుగా విశాఖపట్నం శ్రీ సంఘవి జ్యూయలర్ మాల్ ఏటీఎం వద్ద రూ.75 వేలు, అశీల్‌మెట్ట ఏటీఎం వద్ద రూ.10 వేలు, అదే చోట రెండుసార్లు రూ.10 వేలు, మరోసారి రూ.వెయ్యి తీశాడు. అక్కడి నుంచి ఒడిశా రాష్ట్రంలోకి వెళ్లి బరంపురం సిటీ హాస్పిటల్ రోడ్డులో రూ.10 వేలు, అదేచోట మూడుసార్లు రూ. 10 వేలు చొప్పున, చివరికి గజపతి జిల్లా సూర్యా హాల్‌మార్క్ వద్ద రూ.17,900 తీశాడు. ఈ ఘటనపై గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

3న జెమ్స్‌లో అవగాహన సదస్సు

శ్రీకాకుళం రూరల్: వైద్య ఆరోగ్య రంగాల్లో నైపుణ్యాలు- ఉద్యోగ అవకాశాలపై జిల్లా కేంద్రంలోని రాగోలు జెమ్స్ ఆసుపత్రిలో ఏప్రిల్ 3న అవగాహ న సదస్సు నిర్వహించనున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా కిమ్స్ గ్రూప్ ఆఫ్ చైర్మన్, ఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కర రావు హాజరుకానున్నారని పేర్కొన్నా రు. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు హాజరు కావాలని, పూర్తి వివరాలకు 7680945357, 79950 13422 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఐపీఆర్‌పై అవగాహన అవసరం

ఎచ్చెర్ల క్యాంపస్: మేథో సంపత్తి హక్కు (ఐపీఆర్)పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా పరిశ్రమల శాఖ (డీఐసీ) జనరల్ మేనేజర్ జి.ఎం.శ్రీధర్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో గురువారం మేథో సంపత్తి హక్కులు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పరిశోధన, నూతన ఆవిష్కరణలపై దృష్టిపెట్టి మేథో సంపత్తి హక్కులు పొందాలన్నారు. ఇంజినీరింగ్, ఎంబీఏ తదితర కోర్సులు పూర్తిచేసిన వారు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని చెప్పారు. సదస్సులో ఎంఎస్ఎంఈ సీఈవో సుదర్శన్, నోవెల్ పేటెంట్ సర్వీసెస్ ప్రతినిధి రాజు, రిజిస్ట్రార్ సుజాత పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగురాలిపై లైంగికదాడికి యత్నం

సోంపేట: మండలంలోని బారువ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గ్రామంలో గురువారం దారుణ ఘటన చోటుచేసుకుంది. అమాయకురాలైన మానసిక దివ్యాంగురాలు స్నానం చేస్తుండగా అదే గ్రామానికి చెందిన యువకుడు లైంగికదాడి యత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలి తండ్రి సకాలంలో ఇంటికి చేరుకుని కేకలు వేయడంతో యువకుడు పారిపోయాడు. అనంతరం భార్యకు విషయం చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏడు నెలలు కిందట కూడా ఇదేవిధంగా చేశాడని బాధిత యువతి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నాడు. అప్పుడు మందలించి విడిచిపెట్టినా యువకుడి బుద్ధి మారలేదని వాపోయాడు. సభ్య సమాజానికి చెడ్డపేరు తీసుకువచ్చిన ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలని తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు బారువ ఎస్ఐ హరిబాబునాయుడు కేసు నమోదు చేశారు. యువకుడ్ని అరెస్టు చేసినట్లు తెలిపారు.

అపరాల కొనుగోలు నమోదు ప్రక్రియ ప్రారంభం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లావ్యాప్తంగా రబీ సీజన్‌లో రైతులు పండించిన అపరాల కొనుగోలుకు నమోదు ప్రక్రియ ప్రారంభించినట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మినుములు క్వింటా రూ.7,400, పెసలు క్వింటా రూ.8,682గా మద్దతు ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అపరాలు సాగుచేసి ఈ- క్రాప్, ఈకేవైసీ చేయించుకున్న రైతులు సమీప రైతు భరోసా కేంద్రంలో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పంటను శుభ్రపరచి, జల్లెడ పట్టి సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ధాన్యం కొనుగోలు జరగక ఇబ్బందులు



గుసాని సమితిలో ఆరుబయట ఉన్న ఖరీఫ్ ధాన్యం

మాట్లాడుతున్న జెడ్పీటీసీ బాలరాజు

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుసాని సమితి బాగుసల, బుసుకిడి, ఏడోమైలు, పెద్దకొత్తూరు పంచాయతీ పరిధిలో రైతుల వద్ద నుంచి సొసైటీలు ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో టోకెన్లు గడువు తీరి రద్దయిపోయాయి. రవాణా ఖర్చులు పెట్టి మండీలవద్దకు ధాన్యం తీసుకొస్తే వద్దని చెబుతున్నారని పలువురు రైతులు వాపోయారు. గుసాని సమితి రైతుల తరఫున జెడ్పీటీసీ ఎస్.బాలరాజు మాట్లాడుతూ ప్రతి పంచాయతీ లోనూ ఖరీఫ్ ధాన్యం 2వేల బస్తాలు మిగిలివున్నాయని, కొనుగోలు జరగక రైతులు నష్టపోతున్నారని చెప్పారు.

అడుగంటిన మహేంద్ర తనయ



పర్లాకిమిడి- పాతపట్నం రోడ్డులో మహేంద్రతనయ నది దుస్థితి

పర్లాకిమిడి: ప్రచండ ఎండలకు మహేంద్ర తనయలో నీరు అడుగంటింది. పర్లాకిమిడి, పాతపట్నం సరిహద్దుల్లో నీరు కనుమరుగైంది. పర్లాకిమిడి పట్టణ ప్రజల తాగునీటి అవసరాలకు రోజుకు 12 మిలియన్ గ్యాలన్లు అవసరం వుండగా మహేంద్రతనయ నది నుంచి పంపుసెట్‌ల ద్వారా నీటిని తోడి 7 మిలియన్ గ్యాలన్ల తాగునీటిని మాత్రమే ప్రజాఆరోగ్యశాఖ అందించగలుగుతోంది. గత ఏడు నెలలుగా వర్షాలు కురవకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడినట్టు అధికారులు చెబుతున్నారు.తాగునీట సమస్యపై ఇటీవలే కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

కొనఊపిరితో తమ్ముడు.. ఊపిరి తీసుకున్న అన్న

- వ్యాపారంలో నష్టాలు రావడంతో యాసిడ్ తాగేసిన తమ్ముడు
- బతకడం కష్టమన్న వైద్యులు
- మనస్థాపంతో ఉరి వేసుకున్న అన్నయ్య
- అలుదులో విషాదఛాయలు



రూమ్‌లో ఆత్మహత్యకు పాల్పడిన సూరి

శ్రీకాకుళం రూరల్: రాగోలు జెమ్స్ ఆస్పత్రి బయట గదిలో ఓ వ్యక్తి గురువారం ఉదయం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సారవకోట మండలం అలుదు గ్రామానికి చెందిన శెట్టిసూరి, ఉమామహేశ్వరావులు అన్నదమ్ములు. వీరిద్దరూ కలిసి గ్రానైట్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టడం.. నష్టాలు రావడంతో కొద్దిరోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల కిందట తమ్ముడు ఉమామహేశ్వరరావు తీవ్ర ఒత్తిడికి గురై యాసిడ్ తాగేశాడు. వెంటనే బాధితుడిని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో జాయిన్ చేశారు. బతకడం కష్టమేనని వైద్యులు చెప్పడంతో మనస్థాపానికి గురై అన్నయ్య శెట్టి సూరి(40) ఆసుపత్రి బయట ఓ రూమును అద్దెకు తీసుకొని గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రూమ్‌కు వెళ్లిన సూరి ఎంతకూ తిరిగి రాకపోవడంతో సాయంత్రం 5 గంటల ప్రాంతంలో బంధువులు వెళ్లి చూడగా విగతజీవిగా కనిపించాడు. విషయాన్ని రూరల్ పోలీసులకు తెలియజేశారు. సూరికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్ఐ రాము కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

టీటీసీ వేసవి ట్రైనింగ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం


డీఈఓ ఎస్. తిరుపతి నాయుడు

పార్వతీపురం టౌన్: టీటీసీ వేసవి ట్రైనింగ్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. తిరుపతినాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కడప, అనంతపురంలలో మే 1నుంచి జూన్ 11 వరకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 3 నుంచి 25వరకు ప్రభుత్వ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌సీ.ఏపీ.జీఓవీ.ఇన్‌లో ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. మే 1 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు 45ఏళ్ల లోపు వయస్సు గల వారు అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, అప్లికేషన్‌తో పాటు జిల్లా విద్యాశాఖాధి కారి కార్యాలయంలో మే 1వ తేదీన హాజరు కావాలని సూచించారు.

పోలమాంబ హుండీల ఆదాయం లెక్కింపు


ఆదాయం లెక్కిస్తున్న దేవదాయ శాఖ సిబ్బంది

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి హుండీల ఆదాయాన్ని గురువారం దేవదాయశాఖ సిబ్బంది లెక్కించారు. శంబర పోలమాంబ అమ్మవారి 8,9 జాతరలలో భక్తులు హుండీల్లో సమర్పించుకున్న కానుకలను లెక్కించగా 4,11,188 ఆదాయం వచ్చిందని ఈఓ సూర్యనారాయణ తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా దేవదాయ శాఖ అధికారి ఎస్.రాజారావు, గ్రామ సర్పంచ్ వెదుళ్ల సింహాచలమమ్మ, ఉపసర్పంచ్ అల్లు వెంకటరమణ, మాజీ చైర్మన్ పూడి దాలినాయుడు, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ నైదాన సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గడ్డి మందుతాగి వ్యక్తి ఆత్మహత్య


రమేష్ (ఫైల్)

గుర్ల: మండలంలోని నాగళ్లవలసకు చెందిన సంబర రమేష్ (51) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రమేష్‌కు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువగా ఉండడంతో తట్టుకోలేక బుధవారం గడ్డి మందు తాగేశాడు. గమనించిన కుటుంబసభ్యులు జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుని భార్య ఉమ అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తోంది. కుమారుడు సూర్య ఉన్నాడు, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.నారాయణ రావు తెలిపారు.

పక్కా డాక్యుమెంట్ రీ సర్వే జరగాలి

- జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్ శోభిక


సర్వే సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ శోభిక

కొమరాడ: జిల్లాలో జరుగుతున్న రెండవ విడత రీ సర్వేలో డాక్యుమెంట్లు పక్కాగా ఉండాలని, సమగ్ర విచారణ చేపట్టి తుది నిర్ణయం తీసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆమె కొమరాడ మండలంలోని విక్రంపురం గ్రామంలో పర్యటించారు ఈ సందర్భంగా రెండవ విడత రీ సర్వే పనులపై తనిఖీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ రీ సర్వే చేపడతున్న గ్రామల్లో ముందుగా రైతులకు సమాచారం అందించి తగు రశీదులను పొందాలని స్పష్టం చేశారు. భూముల రీసర్వేలో తలెత్తిన లోపాలను భూయజమానికి ముందుగా నోటీస్ ద్వారా తెలియజేయాలని ఆదేశించారు. వివాదాస్పద భూములకు సంబంధించిన వివరాలు ఆయా రిజిస్టర్లలో నమోదు చేయాలని చెప్పారు. రీ సర్వేలో ఎక్కడా లోపాలు ఉండరాదని అందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివయ్య మండల సర్వేయిర్ వంశీ తదితరులు పాల్గున్నారు.

మరో మూడు రోజులే గడువు..!

- రేషన్ లబ్ధిదారుల్లో ఆందోళన
- ఈనెల 31లోగా ఈకేవైసీ చేయించాలి
- జిల్లాలో 2,77,153 రేషన్‌కార్డులు
- కార్డుల్లో సభ్యులు 8,23,638 మంది
- 7లక్షల మంది వరకు ఈకేవైసీ పూర్తి


పార్వతీపురం పట్టణంలో ఈకేవైసీ చేస్తున్న సిబ్బంది

పార్వతీపురం: రేషన్ పంపిణీలో అక్రమాల కారణంగా చౌకదుకాణాల్లో బియ్యం పక్కదారి పట్టి దుర్వినియోగం కాకుండా చేయాలనే ఉద్దేశంతో రేషన్‌కార్డుల్లోని సభ్యులంతా ఈకేవైసీ చేయించుకుని అర్హులైన వారికి మాత్రమే సబ్సిడీ బియ్యం అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఈకేవైసీ చేయించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల్లో 2,77,153 రేషన్ కార్డులుండగా అందులో 8,23,638 మంది సభ్యులున్నారు. ఇంతవరకు లక్షమంది వరకు ఈ కేవైసీ చేయించుకోలేదు. ఈకేవైసీ చేయించుకునేందుకు ఈ నెల 31వరకు గడువు ఉండగా త్వరితగతిన ఈకేవైసీ చేయించుకోవాలని అధికారులు లబ్ధిదారులకు సూచిస్తున్నారు.

వలస దారుల ఆవేదన

బతుకు తెరువుకోసం యువకులు, వ్యవసాయ కూలీలు హైదరాబాద్, విశాఖపట్నం, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాలకు వలస వెళ్లారు. పండగలు, శుభకార్యాలకు, సొంత గ్రామాలకు వచ్చి తమ రేషన్ కార్డులో పేర్లను తొలగించకుండా జాగ్రత్తలు పడుతున్నారు. అలాగే విద్యాభ్యాసం కోసం ఇతర పట్టణాలకు, ప్రాంతాలకు వెళ్లిన విద్యార్థుల విషయంలోను, వృద్ధులకు వేలిముద్రలు పడని కారణంగా ఈకేవైసీ సమస్య తలెత్తుతోందని పలువురు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఈకేవైసీ చేయించుకోకపోతే సంక్షేమ పథకాలు దూరమవుతామని సర్వత్రా ఆందోళన చెందుతున్నారు.

మొరాయిస్తున్న సర్వర్లు

ఈకేవైసీ చేయించుకునేందుకు సర్వర్లు కూడా తరచూ మొరాయిస్తున్నాయి. అందరూ ఒకేసారి ఈకేవైసీ చేయించుకునేందుకు తరలివస్తున్న కారణంగా సర్వర్లు పనిచేయడం లేదు. ఉదయ, రాత్రి సమయాల్లో సర్వర్ సమస్య లేనప్పటికీ మిగిలిన సమయాల్లో రేషన్ షాపులు, ఆధార్, మీసేవ కేంద్రాల్లో లబ్ధిదారులు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయం పనివేళల్లో ఎక్కువమంది ఈకేవైసీకి రావడంతో సర్వర్లకు లోడ్ ఎక్కువై మొరాయిస్తున్నట్లు సాంకేతిక విభాగ నిపుణులు చెబుతున్నారు. చాలామంది రేషన్ కార్డు లబ్ధిదారులు కేవలం చౌక దుకాణానికి వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని భావించడం వల్ల కూడా సమస్య తలెత్తుతోందని పలువురు అంటున్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

రేషన్ కార్డుల్లో కుటుంబసభ్యులందరూ ఈకేవైసీ చేయించుకోవాలి. మిగిలిన మూడు రోజుల్లో తప్పనిసరిగా చేయించుకోవాలి. లబ్ధిదారులందరికీ ఈకేవైసీ చేసేలా సిబ్బందిని ఆదేశించాం. ఈకేవైసీ చేయించుకోకపోతే ప్రభుత్వ పథకాలకు దూరమవుతారు. లబ్ధిదారులంతా సమీపంలోని చౌక దుకాణాలు, మీసేవా కేంద్రాలకు వెళ్లి ఈకేవైసీ చేయిచుకోవాలి.

ఐ.రాజేశ్వరి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్, పార్వతీపురం మన్యం జిల్లా

- మిస్ తెలుగు యుఎస్‌ఏ' తుదిపోటీలకు సాయిసాత్విక
- ఆమెది తెర్లాం మండలం సోమిదవలస గ్రామం
- మే నెలలో జరగనున్న ఫైనల్ పోటీలు

అమెరికా మెచ్చిన అందం.. తెర్లాం అమ్మాయి సొంతం


అమెరికాలో 'మిస్ తెలుగు యుఎస్ఏ-2025' పోటీల్లో ఫైనలిస్ట్‌గా ఎంపికైన సాయిసాత్విక

తెర్లాం: అమెరికా మెచ్చిన అందం మన తెర్లాం మండలం సోమిదవలసకు చెందిన యువతి చందక సాయిసాత్విక సొంతం. ఓ వైపు చదువు.. మరోవైపు అందంతో అందరినీ ఆకర్షిస్తోంది. ఎమ్మెస్సీ చదువుకోసం అమెరికా వెళ్లిన యువతి డల్లాస్‌లో తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన 'మిస్ యూఎస్‌ఏ-2025' పోటీల్లో తలపడి తుదిపోటీలకు ఎంపిక కావడం తెర్లాం మండలం సోమిదవలస వాసుల్లో ఆనందం నింపింది. మే 25న జరగనున్న ఫైనల్ పోటీల్లో తలపడనుంది. తను విజయం సాధించడానికి భారతీయులంతా తనకు ఓటు వేయాలని సోషల్ మీడియా వేదికగా విజ్ఞప్తిచేస్తోంది. సాయిసాత్విక తండ్రి చందక సూర్యకుమార్ మెకానికల్ ఇంజినీరు కాగా, తల్లి సబిత రేషన్ డీలర్. ఆమె ప్రాథమిక విద్యాభ్యాసం రాజాంలోని సెంట్‌ఆన్స్ పాఠశాలలో, బీఎస్సీ అగ్రికల్చర్ బాపట్లలోని వ్యవసాయ కళాశాలలో చదువుకుంది. డేటా ఎనలైటికల్ కోర్సులో ఎమ్మెస్సీ చదవడం కోసం అమెరికా వెళ్లింది. అమెరికాలోని టెక్సాస్‌లోని ఆస్టిన్ సిటీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్న అక్క సాయిసుస్మిత, బావ వద్ద ఉంటూ మిస్ తెలుగు యుఎస్ఏ-2025 పోటీల్లో పాల్గొంది. సుమారు 300 మంది తెలుగు అమ్మాయిలు పాల్గొన్న పోటీల్లో ఫైనల్‌కు చేరుకుంది. ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ కావాలన్నది సాయిసాత్విక కోరికని, చిన్నతనం నుంచి వ్యాసరచన పోటీల్లో తలపడి బహుమతులు గెలుచుకుందని తల్లి సబిత తెలిపారు. అమెరికా తెలుగు అమ్మాయిల పోటీల్లో కుమార్తె విజయం సాధించేందుకు ప్రతిఒక్కరూ ఓటుతో మద్దతు తెలపాలని కోరారు.

ఫేజ్-2 డీఎస్సీ శిక్షణకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు వెబ్‌ఆప్షన్

పార్వతీపురం టౌన్: ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు ఎంపికైన ఫేజ్-2 ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు వెబ్‌ఆప్షన్ సర్వీసులు ఆన్‌లైన్‌లో చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు జిల్లా షెడ్యూల్ కులాల సాంఘిక సంక్షేమ అధికారి మహ్మద్ గయాజుద్దీన్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 28న గతంలో ఫేజ్-2 ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వివరాలను సరిచేసుకునేందుకు వెబ్‌ఆప్షన్ ఉపయోగించుకోవాలని సూచించారు. ఫేజ్-1లో అభ్యర్థులకు ఎటువంటి వెబ్‌ఆప్షన్ మార్చుకునేందుకు అవకాశం కల్పించలేదన్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు జిల్లా క్రీడాకారులు


ఎన్.అనూరాధ


సుమంత్

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లాకు చెందిన క్రీడాకారులు అవకాశం దక్కించుకున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎన్.అనురాధ, ఇ.సుమంత్‌లు ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు బీహార్ రాష్ట్రంలో జరగనున్న అంతర్ రాష్ట్ర కబడ్డీ పోటీల్లో పాల్గొనను న్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జాతీయ పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులను జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.రంగారావుదొర, కార్యదర్శి కేవీ.ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన.లక్ష్మణరావు, పీడీ వి.సౌదామిని అభినందించారు. రాష్ట్ర జట్టు తరఫున ఆడనున్న ఇద్దరు క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడి జిల్లా ఖ్యాతిని జాతీయస్థాయిలో చాటి చెప్పాలని పిలుపునిచ్చారు.

వక్ఫ్‌బోర్డు చట్టాల సవరణ వెనక్కి తీసుకోవాలి

- కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడు కరీం


సమావేశంలో మాట్లాడుతున్న కరీం

విజయనగరం ఫోర్ట్: ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డ్ చట్టాల సవరణ అంశాన్ని వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం విజయనగరం జిల్లా అధ్యక్షుడు కరీం డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక డీసీసీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖబరస్థాన్ భూములు లాక్కునే ప్రయత్నంలో భాగమే చట్టసవరణ చేయడమని ఆరోపించారు. చట్టసవరణ అంశాన్ని వెనక్కి తీసుకోకపోతే దేశవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సీఎం చంద్రబాబు టీడీపీ సెక్యులర్ పార్టీ అంటారని, వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ బిల్లును ఆయన వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్‌కే. సమీర్, ఎ.రహమాన్, డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల పల్లెనిద్ర

- గ్రామస్తులతో మీతోనే మేము అంటున్న సీఐలు, ఎస్సైలు


పల్లెల్లో నిద్ర చేసిన పోలీసులు

విజయనగరం క్రైమ్: ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో జిల్లాలోని పోలీస్ అధికారులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పల్లెల్లో నిద్ర చేసి మీతోనే మేము అని పల్లె వాసులకు భరోసా కల్పించారు. ఈ విధంగా గ్రామస్తులతో మమేకమవుతూ వారి సమస్యలను విని, క్షేత్రస్థాయిలో పరిష్కరిస్తున్నారు. తద్వారా పల్లెల్లో స్థానికులతో మమేకమవడమే కాకుండా ఆయా గ్రామాలలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఉండేందుకు పల్లెనిద్రతో ఓ కన్నేశారు. అలాగే గ్రామంలోకి వెళ్లి రాత్రి పడుకునే ముందు ఒకసారి గ్రామస్తులతో సమావేశమై సైబర్ నేరాలు, మహిళల భద్రత, శక్తి యాప్, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. దీనిపై ఎస్పీ వకుల్ జిందల్ గురువారం మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను, శాంతిభద్రతల సమస్యలను గుర్తిస్తూ, వాటి పరిష్కారానికి సత్వరం చర్యలు చేపట్టేందుకు సంబంధిత పోలీసు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. అడాప్షన్ కానిస్టేబుల్స్ వారి పరిధిలోని గ్రామాల్లో నెలలో రెండు సార్లు పల్లెనిద్ర చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా పోలీసులకు అతీతంగా గ్రామస్తులతో మమేకం కావాలని, గ్రామసమస్యలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే సమస్యల గురించి వారితో చర్చించి, గ్రామాల్లో ఎటువంటి వివాదాలు, అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

రెండునెల్లో 72 గ్రామాల్లో పల్లెనిద్ర

గ్రామాల్లోకి వచ్చే కొత్త వ్యక్తులు, హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తుల నడవడికపై నిఘా పెట్టాలని, వారు జీవనం ఏవిధంగా సాగిస్తున్నది తెలుసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. గడిచిన రెండు నెలల్లో జిల్లాలో 10మంది సీఐలు, 30మంది ఎస్సైలు 72 గ్రామాల్లో పల్లెనిద్ర చేసి, గ్రామస్తులతో మమేకం కావడం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని, ప్రజల్లో పోలీసుశాఖ పట్ల నమ్మకం, విశ్వాసం పెరుగుతున్నాయని ఎస్పీ వకుల్ జిందల్ సంతృప్తి వ్యక్తం చేశారు.

విద్యార్థినులకు 'శక్తి టీమ్స్' ప్రత్యేక శిక్షణ


కాలేజీల్లో ఆత్మరక్షణపై అవగాహన కల్పిస్తున్న శక్తి టీమ్స్

విజయనగరం క్రైమ్: ఆపద సమయంలో ఉన్న మహిళలు, విద్యార్థినులకు 'శక్తి టీమ్స్' మెలకువలతో కూడిన ప్రత్యేక శిక్షణ ఇస్తాయని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. వివిధ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినుల ఆత్మరక్షణకు అవసరమైన మెలకువలను శక్తి టీమ్స్ నేర్పుతాయన్నారు. వారిలో చైతన్యం నింపుతూ, ఆపద సమయాల్లో ఎలాంటి ఆందోళన చెందకుండా స్పందించేందుకు అవసరమైన మానసిక పరిపక్వత పొందేందుకు ఈ 'శక్తి టీమ్స్' చర్యలు చేపడతాయని చెప్పారు. ఈ మేరకు శక్తి టీమ్స్ కళాశాలలు, పాఠశాలలను సందర్శించే సమయంలో విద్యార్థినులతో మమేకమవుతాయన్నారు. ఏదైనా ఆపద సమయం ఏర్పడినపుడు, మహిళల రక్షణకు విఘాతం కలిగే సంఘటన జరిగినప్పుడు భయపడకుండా, పరిస్థితిని అర్థం చేసుకుని ఎదుర్కొనేందుకు మానసికంగా సిద్ధమయ్యే విధంగా అప్రమత్తం కావాలని పిలుపునిచ్చారు. మీ రక్షణ కోసం శక్తి టీమ్స్ పని చేస్తాయని దీంతో పాటు డయల్ 112,లేదా 100 నంబర్‌లకు కాల్ చేసి పోలీస్ శాఖ సహాయం పొందవచ్చని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా రేగాన


రేగాన శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా రేగాన శ్రీనివాసరావును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. నెల్లిమర్ల మండలంలోని సీతారామునిపేట గ్రామానికి చెందిన ఆయన గతంలో టూరిజం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రెండోసారి వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా అవకాశం ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.

ట్రూఅప్, విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి



"విద్యుత్ సాకులు" పుస్తకం ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

- నేడు విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా

విజయనగరం గంటస్తంభం: సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యుత్ ట్రూఅప్ చార్జీలు, సెకి విద్యుత్ ఒప్పందం రద్దు డిమాండ్లతో శుక్రవారం విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకర్రావు పిలుపునిచ్చారు. 'విద్యుత్ సాకులు' అనే పుస్తకాన్ని విజయనగరం కోట జంక్షన్ వద్ద కార్మికులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకర్రావు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఎటువంటి విద్యుత్ చార్జీలు పెంచమని చెబుతూనే, ట్రూఅప్ చార్జీల పేరుతో ఇప్పటికే రూ.17 వేల కోట్లు ప్రజలపై భారం వేసిందన్నారు. మళ్లీ సెకి ఒప్పందం ప్రకారం విద్యుత్ భారాలు ప్రజలపై వేయడం దుర్మార్గమని, తక్షణమే సెకి ఒప్పందం, ట్రూఅప్ విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే మరో విద్యుత్ ప్రజాపోరాటం జరగనుందని హెచ్చరించారు. విద్యుత్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించనున్న ధర్నాలో ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేస్త్రీ రాజు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధన్వంతరి హోమం


ధన్వంతరీ హోమాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు, పాల్గొన్న దంపతులు

విజయనగరం టౌన్: స్థానిక మన్నార్ రాజగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం ఫ్రెండ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ చైర్మన్ బొడ్డు వెంకటేశ్వర ప్రసాద్ (పండు) నేతృత్వంలో వేదపండితులు శ్రీ ధన్వంతరి హోమాన్ని ఆద్యంతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 60 మంది రుత్విక్కులు, 54 హోమగుండాలు, 163 మంది దంపతులతో అంగరంగ వైభవంగా యాగప్రక్రియ నిర్వహించారు. ఆరోగ్యప్రదాత శ్రీ ధన్వంతరికి ప్రత్యేక పూజలు చేశారు. లోక కళ్యాణార్థం నిర్వహించిన హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సభ్యులు సేవలందించారు. కార్యక్రమంలో సురేష్, రమేష్, గోపాల్ జగదీష్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


హోమంలో పాల్గొన్న భక్తులు

కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ


ర్యాలీలో క్రైస్తవ సోదరులు

బొబ్బిలి: దైవ సేవకుడు, పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్యను నిరసిస్తూ క్రైస్తవులంతా స్థానిక పట్టణంలోని సీబీఎం చర్చి ఆవరణలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ గురువారం చేపట్టారు. దైవసేవకుడి హత్య వెనక ఉన్న నిందితులను తక్షణమే గుర్తించి, అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రోజురోజుకూ క్రైస్తవ సమాజంపై దాడులు పెరుగుతున్నాయని, లౌకిక దేశంలో ఇలాంటి దుర్ఘటనలు దురదృష్టకరమన్నారు. అనంతరం పాస్టర్ ప్రవీణ్ మృతికి సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో వేణు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని సంతకాల సేకరణ


పారిశుధ్య కార్మికులతో సంతకాలు చేయిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు

బొబ్బిలి: తమ ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని పారిశుధ్య కార్మికులు కోరుతున్నారు. ఇదే విషయమై సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు స్థానిక పట్టణంలోని పారిశుధ్య కార్మికులతో సంతకాల సేకరణ గురువారం చేపట్టారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తించిన వారి సేవలను గుర్తించాలని శంకరరావు కోరారు. ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా వారిని పొగడడం కాదని వారి పట్ల చిత్తశుద్ధి నిబద్ధత ఉంటే వారిని శాశ్వత ఉద్యోగులను చేయాలన్నారు. ఆప్కాస్ వంటి ప్రైవేటు ఏజెన్సీకి తమ ఉద్యోగాల భర్తీ, నిర్వహణ బాధ్యతలు అప్పగించవద్దని పారిశుధ్య కార్మికులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తమ న్యాయమైన డిమాండ్‌లు కలిగిన వినతిపత్రాన్ని మున్సిపల్ శాఖామంత్రి నారాయణకు కూడా పంపిస్తామన్నారు. జి.గౌరి, జె.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ పట్టు

- కూటమి పార్టీలకు దక్కని చోటు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: స్థానిక సంస్థల్లో వివిధ కారణాల వల్ల ఖాళీ అయిన స్థానాలకు గురువారం నిర్వహించిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తన పట్టు నిరూపించుకుంది. కూటమి పార్టీలకు ఏ ఒక్క చోట కూడా చోటు దక్కలేదు.

స్థానం పేరు	గెలిచిన అభ్యర్థి పేరు	పార్టీ/మద్దతు
భోగాపురం మండల పరిషత్ వైస్ ఎంపీపీ	పచ్చిపాల నాగలక్ష్మి	వైఎస్సార్ సీపీ
డెంకాడ మండలం గుణుపూరుపేట గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్	వాకాడ అప్పలనారాయణమ్మ	వైఎస్సార్ సీపీ
నెల్లిమర్ల మండలం పూతికపేట గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్	తాళ్లపూడి రమణ	వైఎస్సార్ సీపీ
బొండపల్లి మండలం గరుడుబిల్లి గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్	లెంక కొండమ్మ	వైఎస్సార్ సీపీ
బొండపల్లి మండలం వేండ్రాం గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్	లెంక సుధ	వైఎస్సార్ సీపీ
బొండపల్లి మండలం గొట్లాం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్	కడగల గోవింద్	వైఎస్సార్ సీపీ
గుర్ల మండలం తెట్టంగి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్	జమ్ము గుర్రమ్మ	వైఎస్సార్ సీపీ
మెరకముడిదాం మండలం శ్యామాయవలస ఉపసర్పంచ్	బొత్స శ్రీదేవి	వైఎస్సార్ సీపీ
వంగర మండలం కొప్పరవలస గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్	ముంజి శకుంతల	వైఎస్సార్ సీపీ
సంతకవిటి మండలం మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు	షేక్ హయ్యద్ బీబీ	వైఎస్సార్ సీపీ
విజయనగరం మండలం దుప్పాడ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్	గుడారి హేమలత	వైఎస్సార్ సీపీ
విజయనగరం మండలం నారాయణపురం ఉప సర్పంచ్	నక్కాన ఆదిలక్ష్మి	వైఎస్సార్ సీపీ

ఐటీఐ విద్యార్థుల అద్భుత సృష్టి





చిత్రంలో ఈగెల్‌ను చూశారా.. ఇది విజయనగరం ఐటీఐ విద్యార్థుల అద్భుత సృష్టికి నిలువెత్తు రూపం. మెకానికల్ విభాగానికి చెందిన విద్యార్థులు 16 బైక్ చైన్స్, 2,500 చైన్ లింక్స్‌తో ఈగెల్‌ను సృష్టించారు. దీనిని గాజువాక సిటీ ఐటీఐలో డ్యూయల్ వీటీఈటీ (సీమెన్స్- టాటా స్ట్రైవ్ సంయుక్త) నిర్వహణలో బుధవారం నిర్వహించిన 'ప్రాజెక్టు ఇన్నోవేషన్ చాలెంజ్ కాంపిటేషన్-2025 జోన్-1 పోటీల్లో ప్రదర్శించారు. మొత్తం 30 ప్రదర్శనల్లో 'ఈగెల్' ప్రాజెక్టు మొదటి బహుమతిని సొంతం చేసుకుంది. ఎమ్మెల్సీ చిరంజీవిరావు, కార్పొరేటర్ నరసింహపాత్రుడు, ప్రభుత్వ ఐటీఐ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్‌వీ రమణ, ఐఎంసీ చైర్మన్ బాలాజీ, కోరమండల్ ప్రతినిధి శ్రీనివాసరావు, టాటా స్ట్రైవ్ ప్రతినిధులు రమేష్, మార్కండేయులు, సంతోష్, జోన్- ఐటీఐ ప్రిన్సిపాల్స్ చేతుల మీదుగా విద్యార్థులు బహుమతిని అందుకున్నారు. - విజయనగరం అర్బన్